క్లుప్తంగా

రైతుకు సన్మానం



రైతును సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

షాద్‌నగర్‌రూరల్‌: రైతు వేదికకు వెళ్లేందుకు దారి ఇచ్చిన రైతు కానుకుర్తి మధుకర్‌గౌడ్‌ను సోమవారం మార్కెట్‌ కమిటీ చైర్‌పర్సన్‌ మన్నె కవిత నారాయణయాదవ్‌ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఫరూఖ్‌నగర్‌ మండలంలోని ఎలికట్ట రైతు వేదికకు వెళ్లేందుకు రహదారి లేకపోవడంతో రైతు మధుకర్‌గౌడ్‌ 7గుంటల పొలాన్ని ఉచితంగా దారికి ఇచ్చాడు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ప్రజాప్రతినిధులు, అధికారులు రైతుకు పూలబొకే అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. మధుకర్‌గౌడ్‌ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ నరేందర్‌, సర్పంచ్‌ సాయిప్రసాద్‌యాదవ్‌, ఉపసర్పంచ్‌ మల్లేష్‌ పూజారి, గ్రంథాలయ కమిటీ డైరెక్టర్‌ యాదయ్యయాదవ్‌, నాయకులు నారాయణయాదవ్‌, రంగయ్య, ఏఈఓ తేజ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌ అదాలత్‌లో 171 కేసులు పరిష్కారం



కేసులు పరిష్కరిస్తున్న రిటైర్డు జడ్జి సాంబశివరావు, ట్రాఫిక్‌ పోలీసులు

చేవెళ్ల: ట్రాఫిక్‌ పోలీస్‌ పెండింగ్‌ కేసులపై నిర్వహిస్తున్న లోక్‌ అదాలత్‌లో 171 కేసులు పరిష్కరించినట్లు రిటైర్డు సీనియర్‌ సివిల్‌జడ్జి సాంబశివరావు తెలిపారు. చేవెళ్ల కోర్టు ఆవరణలో సోమవారం నిర్వహించిన లోక్‌ అదాలత్‌లో చేవెళ్ల ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్‌ మండలాల్లో నమోదైన కేసులు పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు ట్రాఫిక్‌ నిబంధనలు తప్పని సరిగా పాటించాలన్నారు. పెండింగ్‌ కేసులు పరిష్కారానికి లోక్‌ అదాలత్‌ ఉపయోగపడుతుందని చెప్పారు. వాహనదారుల నుంచి రూ.4లక్షల 97వేల జరిమానాలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్‌ సీఐ వాసు, ఎస్‌ఐ విఠల్‌రెడ్డి, ఏఎస్‌ఐ చందర్‌నాయక్‌, సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదం

సర్పంచ్‌ రాంచంద్రయ్య



విజేత జట్టుకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్‌, నాయకులు

చేవెళ్ల: శారీర దృఢత్వానికి, మానసికోల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయని గొల్లగూడ సర్పంచ్‌ రాంచంద్రయ్య అన్నారు. మండలంలోని గొల్లగూడలో గతకొన్ని రోజులుగా యూత్‌ నాయకుడు మన్మోహన్‌గౌడ్‌ సహకారంతో జరుగుతున్న ప్రిమియర్‌ లీగ్‌–2023 క్రికెట్‌ టోర్నమెంట్‌ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..యువత క్రీడలపట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. యువతలో దాగి ఉన్న క్రీడాప్రతిభ ఇలాంటి టోర్నమెంట్ల ద్వారా వెలికి తీయొచ్చన్నారు. ప్రభుత్వం కూడా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రీడాపోటీలు నిర్వహిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు మనోహర్‌, జంగయ్య, మురారి, యూత్‌సభ్యులు మహేశ్‌, మల్లేశ్‌, మహేందర్‌, రాజు, రాజేందర్‌, శ్రీనాథం, మధు, హన్మంత్‌, వేఖర్‌, శ్రీను ఉన్నారు.

హామీ నిలబెట్టుకోవాలి



దీక్షలో కూర్చొన్న బీఎస్పీ నేతలు

షాద్‌నగర్‌: లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ నిర్మాణంపై సీఎం కేసీఆర్‌ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, లేకుంటే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు దొడ్డిశ్రీనివాస్‌ అన్నారు. ప్రతిపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 4వ రోజుకు చేరుకున్నాయి. ఈ రిలే నిరాహార దీక్షలకు బీఎస్పీ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ మాట్లాడుతూ... గత ఎన్నికల సమయంలో లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ నిర్మిస్తామని హామీ ఇచ్చిన కేసీఆర్‌ మాట తప్పారని ఆరోపించారు. ప్రజలను మోసపూరిత వాగ్దానాలతో మోసం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్ష్మీదేవిపల్లిని పూర్తి చేయాలని డిమాండ్‌ చేశారు. లేని యెడల రాబోయే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు శ్యామ్‌, కుమార్‌, మోజెస్‌, పరమేశ్వర్‌, శ్రీనురాథోడ్‌, ఉదయ్‌కృష్ణ, శివకుమార్‌, జయప్రకాష్‌ పాల్గొన్నారు.

ప్రత్యేక రాష్ట్రంతోనే విద్యుత్‌ వెలుగులు



చేవెళ్ల: కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే యాదయ్య, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ, డీఈఈలు



షాద్‌నగర్‌రూరల్‌: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తర్వాత విద్యుత్‌ సరఫరాలో తిరుగులేని రాష్ట్రంగా తెలంగాణ అద్భుతమైన ప్రగతిని సాధించింది. కోతల దుస్థితి నుంచి విద్యుత్‌ వెలుగులు విరజిమ్మే రాష్ట్రంగా మారిందని ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కేజీఆర్‌ గార్డెన్‌లో సోమవారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో విద్యుత్‌ప్రగతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాలె యాదయ్యతో పాటు విద్యుత్‌శాఖ ఎస్‌ఈ వెంకన్న, డీఈఈ శివశంకర్‌, ఏడీలు స్వామి, సాయినాథ్‌, ఆర్డీఓ వేణుమాధవ్‌రావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమెల్యే మాట్లాడుతూ.. కేసీఆర్‌ దృఢసంకల్పంతో రాష్ట్రంలో 24 గంటల విద్యుత్‌ సరఫరా అవుతుందన్నారు. అనాడు రైతులు విద్యుత్‌ కనెక్షన్ల కోసం నెలలు, ఏళ్ల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి. నేడు రైతులు ఎప్పుడు అడిగిన విద్యుత్‌ కనెక్షన్‌లు ఎక్కడి నుంచి అయినా ఇచ్చే పరిస్థితికి వచ్చిందన్నారు. గ్రామాల్లో విద్యుత్‌ స్తంభాల ఏర్పాటు, కొత్త వైర్లు వేయడం లాంటి అన్ని పనులు వేగవంతంగా జరిగిపోతున్నాయని చెప్పారు. అనంతరం కళాకారుల ఆటపాటలతో విద్యుత్‌ అధికారుల పనితీరుకు అద్దం పట్టేలా పాటలు నృత్యాలు చేశారు. విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఐసీడీఎస్‌ ఆధ్వర్యలలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు బోనాలు, బతుకమ్మలతో పాల్గొన్నారు. ఎమ్మెల్యే సంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, సన్మానాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీలు, జెడ్పీటీసీలు విజయలక్ష్మి ఎం. మాలతి, గోవిందమ్మ, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌లు వెంకటరంగారెడ్డి, ప్రశాంత్‌, పాపరావు, విద్యుత్‌శాఖ ఏఈలు జాని మోహిద్దీన్‌, హము, ప్రదీప్‌, నరేందర్‌, సబ్‌ఇంజనీర్‌ దుర్గాప్రసాద్‌, అన్నిశాఖల డివిజన్‌లోని నాలుగు మండలాలకు చెందిన రెవెన్యూ, ఎంపీడీఓ, ఐసీడీఎస్‌, డివిజన్‌లోని బీఆర్‌ఎస్‌ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కరెంట్‌ దేశానికే ఆదర్శం

షాద్‌నగర్‌రూరల్‌: ప్రత్యేక రాష్ట్రంలో నిరంతర విద్యుత్‌ సరఫరా చేస్తున్నామని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌ పేర్కొన్నారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సోమవారం పట్టణంలోని ఈడెన్‌ గార్డెన్‌లో విద్యుత్‌ విజయోత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో రూ. 298.1 కోట్లతో విద్యుత్‌ ప్రగతి పనులను చేపట్టడం జరిగిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కరెంట్‌ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. ప్రత్యేక రాష్ట్ర సాధన తర్వాత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం విద్యుత్‌ రంగంలో అనేక మార్పులు తీసుకొచ్చిందన్నారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందిస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచామన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలకు విద్యుత్‌ సబ్సిడీని అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న నిరంతర విద్యుత్‌తో వ్యవసాయ, పారిశ్రామిక రంగం అభివృద్ధి వైపు పరుగులు తీస్తుందని వివరించారు. నియోజకవర్గ అభివృద్ధికి అడగకుండానే నిధులను కేటాయిస్తున్న సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలను తెలియజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, విద్యుత్‌శాఖ అధికారులు, బీఆర్‌ఎస్‌ నాయకులు పాల్గొన్నారు.

పాదయాత్రను విజయవంతం చేయండి

షాద్‌నగర్‌: దళిత వృద్ధురాలి పట్టాభూమికి పొజిషన్‌ చూపించాలని కోరుతూ ఈ నెల 7 నుంచి పాదయాత్ర చేపట్టనున్నట్లు కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి గోవింద్‌ పేర్కొన్నారు. సోమవారం పాదయాత్రకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోవింద్‌ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని కేశంపేట మండలం కాకునూరు గ్రామానికి చెందిన దళిత వృద్ధురాలు ఎర్ర వెంకటమ్మకు గ్రామశివారులో 20 గుంటల భూమి ఉంది. భూమి ధరణి పోర్టల్‌ రికార్డులో, పట్టా పాసు పుస్తకం కూడా ఉంది. అలాగే ప్రభుత్వం అందిస్తున్న రైతు బంధు అందుతుందని వివరించారు. వెంకటమ్మ రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా నేటి వరకు అధికారులు పొజిషన్‌ మాత్రం చూపలేదని చెప్పారు. బాధితురాలి భూ సమస్యను పాలకుల దృష్టికి తీసుకువెళ్లేందుకు ఈ నెల 7న కాకునూరు నుంచి షాద్‌నగర్‌ ఆర్డీఓ కార్యాలయం వరకు చేస్తున్న పాదయాత్ర విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు అర్జునప్ప, తిరుమలయ్య, రవీంద్రనాథ్‌, శ్రీనివాస్‌, కిష్టప్ప, మోహనకృష్ణ, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

మహనీయుల బాటలో నడవాలి



విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్‌: సమసమాజ నిర్మాణం కోసం శ్రమించిన మహనీయుల బాటలో యువత నడవాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని రెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌, బాబు జగ్జీవన్‌రామ్‌ విగ్రహాలను ఆదివారం రాత్రి ఎమ్మెల్యే యాదయ్య చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్‌, జగ్జీవన్‌రామ్‌ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. వారి ఆదర్శ మార్గాలే నేటి యువతరానికి దిక్సూచి అన్నారు. గ్రామాల్లో వారి విగ్రహాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ శ్రీకాంత్‌, మాజీ జెడ్పీటీసీ కొంపల్లి అనంతరెడ్డి, సర్పంచ్‌లు వినిత, నరోత్తంరెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌, ఆల్‌ఇండియా అంబేడ్కర్‌ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బేగరి రాజు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ సాత విజయలక్ష్మి



శంకర్‌పల్లి: మొక్కలు నాటుతున్న విజయలక్ష్మి, ఇతర నాయకులు

శంకర్‌పల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని శంకర్‌పల్లి మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ సాత విజయలక్ష్మి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటుకోవాలని సూచించారు. చెట్లను నరకడం వల్ల పర్యావరణంలో మార్పులు వస్తాయని తెలిపారు. పచ్చని చెట్లు ఉంటేనే వర్షాలు సకాలంలో పడుతాయని చెప్పారు. కార్యక్రమంలో వైస్‌ చైర్మన్‌ వెంకట్‌రాంరెడ్డి, కమిషనర్‌ జ్ఞానేశ్వర్‌, కౌన్సిలర్‌ రాములు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

మొయినాబాద్‌: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని శ్రీరాంనగర్‌ సర్పంచ్‌ సన్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని శ్రీరాంనగర్‌లో సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సంకల్ప్‌తరు ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో హెచ్‌డీపీ ఫైనాన్స్‌, ఎస్‌బీఐ సహకారంతో 33 ఎకరాల్లో 63 వేల మొక్కలు నాటే కార్యక్రమం సర్పంచ్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడవులు అంతరించి పోతుండడంతోనే పర్యావరణం దెబ్బతింటుందన్నారు. పర్యావరణాన్ని కాపాడాలంటే విరివిగా మొక్కలు నాటి అడవులను పెంచాలన్నారు. మొక్కలు నాటేందుకు సంకల్ప్‌తరు ఫౌండేషన్‌ ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఫౌండేషన్‌ రాష్ట్ర కోఆర్డినేటర్‌ రమేష్‌ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తూ అడవులను పెంచడానికే సంకల్ప్‌తరు ఫౌండేషన్‌ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్‌ శేఖర్‌, హెచ్‌డీబీ ఫైనాన్స్‌ ప్రతినిధులు సత్యనారాయణ దూబే, సతీష్‌ బూర్ల, అనిల్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, నరేందర్‌, విజయభాస్కర్‌, మహేశ్‌, ఆనంద్‌, సతీష్‌, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మొయినాబాద్‌రూరల్‌: అప్పటి ఉపాధ్యాయులను సన్మానించిన విద్యార్థులు



షాద్‌నగర్‌రూరల్‌: సమ్మేళనంలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

మొయినాబాద్‌రూరల్‌: మండలంలోని చందానగర్‌ జిల్లా పరిషత్‌ పాఠశాలలో 1999–2000 సంవత్సరం 10వ తరగతి పూర్తి చేసుకున్న అప్పటి విద్యార్థులు 23 సంవత్సరాల తరువాత ఒక చోట కలిసి ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. అనంతరం అప్పటి ఉపాధ్యా యులు కృష్ణారెడ్డి, వెంకటరామిరెడ్డిలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ..డబ్బులతో ఎన్నో కొనొచ్చు కానీ, విద్యను కొనలేరని అన్నారు. గురువులు నేర్పిన విద్యాబుద్ధులతో వారు ఉన్నతస్థాయికి ఎదిగారని అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అపూర్వ 'కలయిక'

షాద్‌నగర్‌రూరల్‌: మండలంలోని సర్దార్‌నగర్‌ జెడ్పీహెచ్‌ఎస్‌లో 1997–98లో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 25సంవత్సరాల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఎంతో ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఉద్యోగాలు, వ్యాపారాలు, కుటుంబ బాధ్యతలతో తీరిక లేకుండా ఎక్కడెక్కడో ఉన్నప్పటికీ 25 ఏళ్ల అనంతరం స్నేహితులను కలుసుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రతాప్‌రెడ్డి, యాదగిరిచారి, ముస్తాఫ, దేవేందర్‌రెడ్డి, లక్ష్మయ్య, షమీమ్‌, పూర్వ విద్యార్థులు సాయినాథ్‌, యాదగిరి, శ్యాంసుందర్‌, మల్లారెడ్డి, శివ, పవన్‌రెడ్డి, శివరాజ్‌, భాస్కర్‌ఇలియాస్‌, శ్రీశైలం పాల్గొన్నారు.

బడీడు పిల్లలను స్కూల్‌లో చేర్చాలి

ప్రధానోపాధ్యాయులు రాములు



మొయినాబాద్‌రూరల్‌: ఇంటింటా ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

మొయినాబాద్‌రూరల్‌: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం ఉచితంగా అందజేయడం జరుగుతుందని హిమాయత్‌నగర్‌ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని హిమాయత్‌నగర్‌లో ప్రధానోపాధ్యాయుడు రాములు ఉపాధ్యాయులతో కలిసి బడీడు పిల్లలను పాఠశాలకు పంపాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు అందంగా ఉన్నాయని తెలిపారు. ఉచిత విద్యతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని చెప్పారు. ఆర్థిక ఇబ్బందులకు గురి కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీతారెడ్డి, స్వప్న, సంతోషి, జమునా నాయక్‌, మహేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

పాపిరెడ్డిగూడలో బడిబాట

కేశంపేట: మండలంలోని పాపిరెడ్డిగూడలో ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు సోమవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ప్రైవేట్‌ పాఠశాలకు వెళ్తున్న విద్యార్థుల తల్లిదండ్రుల ఇంటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో చదివించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో పాఠ్యాపుస్తకాలు, స్కూల్‌ యునిఫాం, మధ్యాహ్న భోజనం ఉచితంగా అందిస్తారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటయ్యగౌడ్‌, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగయ్య, ఉపాధ్యాయురాలు స్వప్న తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డల క్షేమమే ప్రభుత్వ లక్ష్యం

అంగన్‌వాడీ టీచర్ల కార్యదర్శి కవిత

మొయినాబాద్‌రూరల్‌: తల్లీబిడ్డల క్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పౌష్టికాహారం పంపిణీ చేస్తోందని మండల అంగన్‌వాడీ టీచర్ల కార్యదర్శి కవిత పేర్కొన్నారు. సోమవారం మండలంలోని హిమాయత్‌నగర్‌ అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక శ్రీమంతాలు, పౌష్టికాహార పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు చేసి పౌష్టికాహారం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, చిన్న పిల్లలు, బాలింతలకు పౌష్టికాహారం అందించడంతో వారు ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. స్వచ్ఛమైన ఆహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ముఖ్యంగా పౌష్టికాహారంలో పాలు, గుడ్లు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి, జిల్లా పరిషత్‌ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మెహర్‌ఉన్నీసాబేగం, అంగన్‌వాడీ ఆయా రజనీ, గర్భిణులు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.



గర్భిణులకు సీమంతాలు చేస్తున్న కవిత

అప్రమత్తతతోనే రక్ష

- కేజ్‌వీల్స్‌తో జాగ్రత్త
- ప్రాణాలతో చెలగాటం వద్దు



షాబాద్‌లో కేజ్‌వీల్స్‌తో పొలం దున్నుతున్న రైతులు

షాబాద్‌: ప్రస్తుత కాలంలో వ్యవసాయంలో యంత్రాల వినియోగం ఎక్కువైంది. పొలం దున్నేందుకు, జంబు కొట్టేందుకు ట్రాక్టర్‌ కేజ్‌వీల్స్‌ను వినియోగిస్తున్నారు. కేజ్‌వీల్స్‌తో ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయి డ్రైవర్లు కేజ్‌వీల్స్‌ కిందపడి ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు అనేకం. ప్రస్తుతం వానాకాలం సాగు ప్రారంభమైంది. వర్షాలు కూడా కురుస్తున్నాయి. రైతులు పంట పొలాలను సిద్ధం చేస్తున్నారు. ఈ తరుణంలో డ్రైవర్లు కేజ్‌వీల్స్‌ నడిపించేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్రమాదాలకు కారణాలు

పొలాలు అన్ని ఒకేలా ఉండవు. పొలాన్ని నీటితో నింపిన తర్వాత డ్రైవర్‌కు భూమి ఎలాంటిదో తెలియక పోవడం. నారు ఎక్కువగా ఉన్న స్థలంలో ఎక్కువ లోతుకు కేజ్‌వీల్‌ వెళ్లడం. అక్కడ భూమి వదులుగా మారడం జరుగుతుంది. గట్టి ప్రదేశంలో వెళ్లడానికి డ్రైవర్లు యాక్సిలేటర్‌ ఎక్కువగా ఇస్తుంటారు. బరువంతా కేజ్‌వీల్స్‌పై పడుతుంది. దీంతో ముందు టైర్లు బరువులేక ట్రాక్టర్‌ బోల్తా పడే అవకాశాలు ఉంటాయి. పొలం చివరి మూలల్లో ఎక్కువ సార్లు కేజ్‌వీల్స్‌ నడుస్తాయి. అక్కడ లోతుగా తయారవుతోంది. వేగంగా వెళ్లే క్రమంలో దిగబడి బోల్తా పడుతుంది. డ్రైవర్లకు పూర్తిస్థాయి నైపుణ్యత లేక, ఓవర్‌ స్పీడ్‌తో పొలాల్లో దున్నడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ట్రాక్టర్‌ దున్నడంలో లోతు పెరిగిన కొద్ది ప్రమాదాలు ఎక్కువగా జరిగే ఆస్కారం ఉందని ఇంజనీరింగ్‌, వ్యవసాయ శాస్త్రవేతలు, నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ముందస్తు జాగ్రత్తలు

- కేజ్‌వీల్స్‌ బిగించేటప్పుడు తప్పనిసరిగా వెనుక టైర్లు సమాన స్థాయిలో ట్రాక్టర్‌ బంపర్‌ ముందు వెయిట్‌ బిల్లలు వేసుకోవాలి.
- బరువు ఎక్కువతే మైలేజ్‌ తక్కువగా వస్తుందనే ఉద్దేశంతో వాడడం లేదు. అది సరైన విధానం కాదు.
- ట్రాక్టర్‌ను పొలంలోకి దించే ముందు పూర్తిస్థాయి కండిషన్‌గా ఉంచుకోవాలి.
- పొలం దున్నుతున్న సమయంలో ట్రాక్టర్‌ను ఎప్పుడు ఒకే వేగంతో నడపాలి.
- యజమానుల మెప్పు కోసం వేగం పెంచొద్దు.
- మూల మలుపు దగ్గర వేగం తగ్గించాలి.
- కేజ్‌వీల్స్‌తో దున్నేప్పుడు ట్రాక్టర్‌కు కల్టివేటర్‌ అమర్చుకోవాలి.
- దీంతో బోల్తా పడే అవకాశాలు తక్కువగా ఉంటాయి.